
నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 25 మార్చి 2025 | NAGARKURNOOL

# మాఫీ మోసం!

## ప్రభుత్వం నిస్సిగ్గుగా..



రూ.2 లక్షలకుపైగా ఉన్న రుణాలను వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా పరి గణన లోకి తీసుకున్నారు. కుటుంబంలో ఒక్కరికే ఇంత రుణం ఉన్నా.. లేదా కుటుంబంలో భార్య, భర్తకు ఇద్దరికీ కలిసి రూ.2 లక్షలకుపైగా ఉన్నా.. రూ.2 లక్షలకుపైగా ఉన్న వారిని జాబితాలో ప్రభుత్వం గుర్తించింది. భార్యకు రూ.1.10 లక్ష, భర్తకు రూ.1.10 రుణం ఉన్నా.. వారి ఖాతాల రుణాలను ఒక్కటిగా మార్చి రూ.2 లక్షలకుపైగా ఉన్న ఖాతాలుగా గుర్తించింది. ప్రభుత్వం ప్రణాళికాబద్ధం గానే రూ.2 లక్షల నిబంధన తెచ్చిందని అర్థమవుతున్నది. గ్రామాలలో చాలా మంది భార్య, భర్తకు భూములు ఉన్నాయి. వారు పంట రుణాలను కూడా తీసుకున్నారు. సరాసరిన లెక్కిస్తే.. 50 శాతం మంది భార్యాభర్తలకు భూములు ఉన్నాయి.. రుణాలు ఉన్నాయి.. అందుకే ప్రభుత్వం రుణాల విషయంలో కుటుంబం మొత్తానికి రూ.2 లక్షల వరకే రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. ఇప్పుడు అదే నిబంధనను అడ్డం పెట్టుకొని పెద్ద మొత్తంలో రుణాలను మాఫీ చేయడం లేదని నిస్సిగ్గుగా ప్రకటించింది. దీంతో రైతు సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

- చేతులెత్తేసిన ప్రజాపాలన ప్రభుత్వం
- ఇంతవరకు అంతంతే చేసిన వైనం
- రూ.2 లక్షలకు పైబడిన రుణాలకు మాఫీ లేదన్న ప్రకటనపై ఆక్రోశం
- కర్మ తప్పదంటూ రైతుల అసహనం

### నమ్మించి దగా చేసింది



ప్రభుత్వం రుణమాఫీ విషయంలో నమ్మించి మోసం చేసింది. ఎన్నికలకు ముందుకు రైతు డిక్లరేషన్‌లో హామీలు ఇచ్చి అధికారం వచ్చాక రైతులను నిలువునా మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకే చెల్లింది. రూ.2 లక్షల వరకైనా రుణమాఫీ చేసిందా? అంటే అదీ లేదు. ఇప్పుడేమో రూ.2 లక్షలకుపైగా ఉన్న రుణాలను మాఫీ చేయమని ప్రభుత్వం ప్రకటించింది. రైతుల విషయంలో ఒక్క మాటనూ నిలుపుకోలేదు. దేవుళ్లపై ఒట్లు వేశారు.. కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో తిరగలేని పరిస్థితి తెచ్చుకున్నారు. హస్తం పార్టీని నమ్మి ఓట్లు వేసిన రైతులు నిలువునా మోసపోయారు. సర్కారు రైతుల విషయమై మరోసారి పునరాలోచించుకోవాలి.

**- రాంచంద్రారెడ్డి, రైతు జేఏసీ నాయకుడు, కల్వకుర్తి**

కల్వకుర్తి, మార్చి 24 : అబద్ధపు మాటలు.. మోసపూరిత ప్రకటనలు.. రేవంత్ సర్కారు రైతులకు నిలువు పంగనామాలు పెట్టింది. గత 16 నెలలుగా రుణమాఫీ చేస్తామని దేవుళ్లపై ఒట్లు వేసిన ముఖ్యమంత్రి.. తాను వేసిన ఒట్లను గట్టుమీద పెట్టేశాడు. ఇప్పటి వరకు చేసిన రుణమాఫీ అంతంత మాత్రమే.. రాష్ట్ర ప్రభుత్వం.. ఒక్క ప్రకటనతో రుణమాఫీ కథకు ఫుల్‌స్టాప్ పెట్టేసింది. రూ.2 లక్షలకుపైగా ఉన్న పంట రుణాలను మాఫీ చేయడం లేదని వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటించడంతో రైతుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇచ్చిన రుణమాఫీ పథకాన్ని అటకెక్కించిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును రైతులు తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు. ప్రభుత్వం మాఫీ చేస్తుందనే ఆశతో రైతులు.. ప్రభుత్వం ఇచ్చిన మాటలు నమ్మి రూ.2 లక్షలకుపైగా ఉన్న డబ్బులను బ్యాంకులకు చెల్లించారు. ఇప్పుడు రూ.2 లక్షలకుపైగా ఉన్న రుణాలను మాఫీ చేయడం లేదని ప్రభుత్వం ప్రకటించడంతో డబ్బులు చెల్లించిన రైతులు మండిపడుతున్నారు. ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నమ్మి ఓట్లు వేస్తే నిలువునా ముంచారని, కర్మ ఫలితాన్ని అనుభవించక తప్పదని వేదాంత ధోరణిలో రైతులు వాపోతున్నారు.

**నాగర్‌కర్నూల్ జిల్లాలో..**

నాగర్‌కర్నూల్ జిల్లాలో 3,22,724 మంది రైతులు ఉన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం 1,11,297 మంది రైతులకు సంబంధించి దాదాపు రూ.974 కోట్ల పంట రుణాలు మాఫీ చేసింది. ఇంకా దాదాపు 2,11,427 మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉన్నది. ఇందులో చాలా మంది రైతులు రూ.2 లక్షల వ్యవసాయ రుణాలను కలిగి ఉన్న వారే. ప్రభుత్వం ఇప్పటి వరకు మూడో వంతు రైతులకు మాత్రమే రుణమాఫీ చేసిందని రైతులు అంటున్నారు. ప్రతి గ్రామంలో రుణమాఫీ వచ్చినా వారి కంటే.. రుణమాఫీ కాని రైతుల సంఖ్య ఎక్కువగా ఉందని గణాంకాలను చూస్తే అర్థమవుతున్నది.

# రైతుల కన్నీళ్లు సీఎంకు పట్టవా?

- శ్రీశైలం నీటిని ఆంధ్రప్రదేశ్‌కు తరలించింది రేవంత్‌రెడ్డి కాదా..?
- రైతులను ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- మీడియాతో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూర్, మార్చి 24 : రాష్ట్రంలో, ముఖ్యంగా ముఖ్యమంత్రి నియోజకవర్గంలో రైతులు కన్నీరు పెడుతున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పట్టడం లేదని, గ్రామల్లో తాగు నీరు దొరకని పరిస్థితి ఏర్పడిందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మద్దూర్ మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనంత వరదలు ఈ దఫా వచ్చినా శ్రీశైలంలో నీరు ఎందుకు లేకుండా పోయిందో అందరికీ తెలుసన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు కోసం గురు దక్షిణ కింద కృష్ణనీటిని ఆంధ్రలోని పోతిరెడ్డిపాడు నుంచి తరలించింది రేవంత్ రెడ్డి కాదా అని ప్రశ్నించారు. కొడంగల్ నియోజకవర్గంలో రైతులు పంటలు ఎండిపోయి కన్నీరు పెడుతున్నా ముఖ్యమంత్రికి పట్టడం లేదన్నారు. కోస్గి మండలంలోని చంద్రవంచ సభలో మార్చి నాటికి రైతులందరికీ రైతు భరోసా వేస్తానని చెప్పినా నేటికీ రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమకాలేదని, అబద్ధపు ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒక్క గ్యారెంటీ కూడా పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఉగాది నాటికి రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.రెండు లక్షల రుణమాఫీ విషయంలో ప్రభుత్వం చేతులెత్తేసిందని, రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసే వరకు ముఖ్యమంత్రిని విడిచిపెట్టేది లేదన్నారు. ఎండిన పంటలకు ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని జామియా మసీదు వద్ద ముస్లింకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సలీం, శాసం రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్, వీరారెడ్డి, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

# పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- కొత్తకోటలో బీఆర్‌ఎస్ మాజీ సర్పంచుల ధర్నా

కొత్తకోట, మార్చి 24 : గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టిన తమకు ఏడాదిన్నర కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నదని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని, త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మాజీ సర్పంచులు కొత్తకోట పట్టణంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాల్లోని సర్పంచుల పదవీకాలం ముగిసి నేటికీ 14 నెలలు గడుస్తున్నా స్థానిక ఎన్నికల నిర్వహణను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ హయాంలో సర్పంచులుగా ఉండి చేసిన అభివృద్ధి పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా తీవ్రంగా వేధిస్తున్నదని ఆరోపించారు. ఈ విషయమై బీఆర్‌ఎస్ నాయకులు గొంతెత్తి ప్రశ్నించినా? ధర్నా చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల చేత అక్రమ అరెస్టులు చేయించి అణగతొక్కే ప్రయత్నం చేస్తున్నదని దుయ్యబట్టారు. స్థానిక ఎన్నికలు నిర్వహించకుండా గ్రామాలను ప్రత్యేక అధికారుల చేతిలో పెట్టడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. గ్రామంలోని వివిధ సమస్యలను ప్రజలు ప్రత్యేకాధికారుల దృష్టికి తీసుకువెళ్తే వారు పట్టించుకోవడం లేదని, దీంతో గ్రామాల్లో పారిశుధ్యం పూర్తిగా పడకేసిందన్నారు. అంతేకాకుండా రెండు రోజుల కిందట కురిసిన అకాల వడగండ్ల వర్షానికి మండలంలోని కొన్ని వందల ఎకరాల వరకు పంట నష్టం వాటిల్లిందని, ఈ విషయమై రైతులు మొర పెట్టుకుంటున్నా కూడా కాంగ్రెస్ పార్టీలోని ఏ ఒక్క నాయకుడు రైతు వంక చూడలేదని, వారి సమస్యను పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించడంతోపాటు త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. అనంతరం వనపర్తికి వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్, ఉమ్మడి జిల్లా సీడీసీ చైర్మన్ చెన్న కేశవరెడ్డి, ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి గాడిల ప్రశాంత్, అయ్యన్న, శ్రీనువాసులు జీ, పరమేశ్, నెహ్రూ, రాజు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో పెండింగ్ బిల్లుల కోసం ఆందోళన చేస్తున్న మాజీ సర్పంచులు

# ప్రమాదమని తెలిసినా.. నిర్లక్ష్యమా..?

- అద్దం లేకుండానే ప్రైవేట్ పాఠశాల బస్సు ప్రయాణం
- ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు



జడ్చర్లలో వెనుక అద్దం లేకుండా వెళ్తున్న ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు

జడ్చర్ల టౌన్, మార్చి24 : తెలిసి..తెలియని వయస్సు కలిగిన చిన్నారులు ప్రయాణిస్తున్న ఓ ప్రైవేట్ పాఠశాల బస్సును వెనుక అద్దం లేకుండానే నడిపించడంపై చర్చనీయాంశమైంది. సోమవారం జడ్చర్ల లోని సిగ్నల్‌గడ్డ ప్రధాన రహదారి మీదుగా ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు వెనుక భాగంలో అద్దం లేకుండానే వెళ్తుండాన్ని స్థానికులు గుర్తించారు. బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులు ఏ మాత్రం ఏమర పాటుగా ఉన్నా పెద్ద ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉన్నది. విద్యార్థులు ప్రయాణించే బస్సుకు వెనుక అద్దం లేకపోతే ప్రమాదమని తెలిసినా పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా బస్సును నడిపిస్తుండంపై విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా రవాణాశాఖ, విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రైవేటు పాఠశాలల బస్సులపై నిఘా పెట్టి ప్రమాదకరంగా ఉన్న బస్సులను గురించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే సంబంధిత అధికారులు ముందస్తుగా స్పందిస్తే ప్రమాదాలకు గురికాకుండా అరికట్టవచ్చని అభిప్రాయపడుతున్నారు.

# కానరాని నీటి జాడలు

*యాసంగి పంటలకు సాగునీటి కష్టాలు మొదలయ్యాయి.*

**ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వేసవి ప్రారంభంలోనే సాగు, తాగునీటి ఎద్దడి తీవ్రమైంది. చెరువులు, కుంటలు అడుగంటుతుండగా.. కాల్వలు వెలవెలబోతున్నాయి. బోరుబావుల్లో భూగర్భ జలాలు పడిపోయాయి. దీనికి తోడు పలు చోట్ల కరెంట్ సమస్యలు వేధిస్తుండడంతో రైతుల బాధలు వర్ణణాతీతం. రెక్కలు ముక్కలు చేసుకొని.. వేల రూపాయాలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు కండ్ల ముందే ఎండుతుండడంతో చూసిన కర్షకుల గుండె బరువెక్కుతున్నది.**

– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, మార్చి 24

- ఎండుతున్న పంటలు
- పడిపోయిన భూగర్భ జలాలు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో రైతులు



నారాయణపేట జిల్లా ధన్వాడ శివారులో ఎండిపోతున్న వరి పంటను చూపుతున్న సంద రాజు

## మూడు బోర్లు వేసినా.. చుక్క నీరు పడలే..

ధన్వాడ, మార్చి 24 : ధన్వాడ మండల కేంద్రానికి చెందిన రైతు సంద రాజు ఐదెకరాల్లో రెండు బోర్లల్లో నీళ్లు పుష్కలంగా ఉండడంతో మూడెకరాల్లో వరి పంట సాగు చేశాడు. మిగిలిన రెండెకరాలు బీడుగా ఉంచాడు. పంటలు పొట్ట దశ నుంచి చేతికొచ్చే సమయంలో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోయాయి. దీంతో ఒక్కసారిగా బోర్లు వట్టిపోయాయి. దీంతో రైతుకు ఏం చేయాలో పాలుపోలేదు. పంటలు వాడుపడుతుండంతో ఎలాగైనా కాపాడుకోవాలన్న తాపత్రయంతో తెలిసిన షావుకారి వద్ద రూ.లక్ష అప్పు తెచ్చాడు. వారం వ్యవధిలో పొలంలో వేర్వేరు చోట్ల మూడు బోర్లు వేశాడు. అయినా చుక్క నీరు పడలేదు. నీళ్లు లేక పంట ఎండిపోతున్నది. సాగుబడుల కోసం తెచ్చిన అప్పు రూ.లక్ష, బోర్ల కోసం తెచ్చిన మరో రూ.లక్ష మొత్తం 2 లక్షలు ఎలా చెల్లించాలో అర్థం కావడం లేదని ఆందోళన చెందుతున్నాడు. ఎండిన పంటలను అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. మిగితా రైతులకు సర్కారు అండగా నిలబడాలన్నారు.



పల్లెగడ్డ శివారులో యాదయ్య పొలంలో డ్రిల్ చేస్తున్న బోరు బండి (ఇన్‌సెట్లో) రైతు యాదయ్య

## ఒకే రోజు రెండు బోర్లు.. చుక్క నీరు పడలే..

నవాబ్‌పేట, మార్చి 24 : కాంగ్రెస్ హయాంలో రైతులకు కన్నీటి కష్టాలు ఎదురవుతున్నాయి. బోరు బావులు, చెరువులు, కాల్వలు వట్టిబోవడంతో ఎక్కడికక్కడ పంటలు ఎండుతున్నాయి. వీటిని చూసిన రైతు గుండెకు కోతలే మిగులుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం పల్లెగడ్డ గ్రామానికి చెందిన రైతు ఈసూరి యాదయ్య రెండు నెలల కిందట మూడున్నర ఎకరాల్లో వరి సాగు చేశాడు. పంట చేతికందే దశలో భూగర్భ జలాలు అడుగంటడంతో ఆందోళన చెందాడు. పంటను ఎలాగైనా కాపాడుకోవాలన్న తాపత్రయంతో తన పొలంలో సోమవారం ఒకే రోజు రెండు బోర్లు వేశాడు. ఒక చోట 300 ఫీట్ల వరకు బోరు వేసినా నీళ్లు పడలేదు. దీంతో మరో చోట 200 ఫీట్లు బోరు డ్రిల్ చేయించాడు.. అయినా చుక్క పడలేదు. కష్టం ఉట్టిగనే పోగా.. పైగా బోర్ల కోసం తెచ్చిన రూ.1.20 లక్షల అప్పు మీద పడిందని రైతు దిగాలు చెందుతున్నాడు. ఓ పక్క ఆరుగాలం కష్టపడి పండించిన పొలం ఎండుతుంటే.. మరో పక్క రెండు బోర్లు వేసినా నీళ్లు రాకపోవడంతో రైతు ఆవేదన వర్ణణాతీతం.

## కుంట నీరు యథేచ్ఛగా..

హన్వాడ, మార్చి 24 : మండలంలోని నాయినోనిపల్లి గ్రామ సమీపంలో ఉన్న పబ్బన్నకుంట కింద రైతులు వరి పంట సాగు చేశారు. అయితే కొద్ది మంది రైతులు తమ పంటల కోసం ఎలాంటి అనుమతి లేకుండా ఇష్టానుసారంగా కుంట నుంచి బోర్ల ద్వారా నీటిని తోడుకుంటున్నారు. అయినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. అయితే కుంటలో నీరు లేకపోతే ఎండకాలం మూగజీవాలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉన్నది. అంతేకాకుండా చుట్టుపక్కల ఉన్న బోర్లలో సైతం నీటిమట్టం తగ్గే అవకాశం ఉందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అక్రమంగా నీటిని తోడుకుంటున్న రైతులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పబ్బన్నకుంట నీటిని తోడేస్తున్న మోటరు

## కాలుతున్న మోటర్లు



దాసరిపల్లిలో సత్యశీలారెడ్డి పొలంలో రిపేర్ చేయించిన బోరు మోటర్‌ను బిగిస్తున్న రైతులు

మూసాపేట, మార్చి 24 : మండలంలోని దాసరిపల్లి గ్రామంలో మోటర్లు కాలిపోతున్నాయని, దీంతో ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన తిరుపతిగారి సత్యశీలారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డికి చెందిన వ్యవసాయ బోరు మోటరు కాలిపోయినట్లు తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో వచ్చిన మరమ్మతు కారణంగా తమ మోటర్లు కూడా కాలిపోతున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మకు మరమత్తు చేయించి ఇచ్చినా కానీ తరుచూ ట్రాన్స్‌ఫార్మర్ల తోపాటు మా మోటర్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచాలని బాధిత రైతులు కోరుతున్నారు.

# సాగునీరు అందించి పంటలు కాపాడండి


- గద్వాల కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా
- సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలంటూ కలెక్టర్‌కు వినతి

గద్వాల, మార్చి 24 : సాగునీరు అందక పంటలు ఎండుతున్నాయి.. తమ పంటలకు సాగునీరు విడుదల చేసి కాపాడాలంటూ అలంపూర్ తాలూకా రైతులు డిమాండ్ చేశారు. సోమవారం అయిజ మండల పరిధిలోని పులికల్, రాజపూర్, మేడికొండ, సింధనూర్, కొత్తపల్లి, బైనపల్లి, చిన్న తాండ్రపాడు, కిసాన్‌నగర్, కుట్కనూర్ తదితర గ్రామాలకు చెందిన సుమారు వందమంది రైతులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు నర్సింహులు, సుధాకర్‌గౌడ్, వెంకటేశ్, హుస్సేన్, నాగిరెడ్డి తదితరులు మాట్లాడుతూ సింధనూర్ డీ–12ఏ పరిధి నుంచి ఉప్పల వరకు రైతులు సుమారు 22 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేసినట్లు చెప్పారు. అయితే ప్రస్తుతం పంట చివరి దశలో ఉందని ఈ సమయంలో ఆర్డీఎస్ కాల్వకు వచ్చే నీరు నిలిచి పోయిందని, దీంతో ప్రస్తుతం నీరు లేక పోవడంతో పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో ఆర్డీఎస్ కాల్వకు నీటిని విడుదల చేయకపోతే మొత్తం 22వేల ఎకరాల్లో వేసిన వరి పంట ఎండిపోయే అవకాశం ఉందని, అదే జరిగితే తమకు ఆత్మహత్యే శరణ్యమని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పది రోజుల దాకా రోజు నాలుగు వేల క్యూసెక్కుల నీటిని తుంగభద్రానది నుంచి విడుదల చేస్తే పంటలు చేతికి వచ్చే అవకాశం ఉందన్నారు. ఆ దిశగా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కర్ణాటక ప్రభుత్వం ఏప్రిల్ మొదటి వారంలో నీటిని విడుదల చేస్తామని చెబుతుందని అప్పుడు నీటిని విడుదల చేస్తే ఎవరికి ఉపయోగం అన్నారు. ఈ రెండు రోజుల్లో ప్రభుత్వం స్పందించి నీటిని విడుదల చేయిస్తే పంటలు కాపాడిన వారవుతారని చెప్పారు. కొంత మంది ప్రజాప్రతినిధులు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సాగునీటిని విడుదల చేయాలని కర్ణాటక ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్లారని ఇప్పుడు వాళ్లు ఎక్కడున్నారని, నీళ్లు ఏడున్నాయని ప్రశ్నించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతు భరోసా ఎలాగో ఇవ్వడం లేదని కనీసం సాగు నీరు అందించి పంటలను కాపాడాలని వారు కోరారు. ధర్నా చేస్తున్న రైతుల వద్దకు వచ్చిన పట్టణ ఎస్సై రైతులను కలెక్టర్ వద్దకు తీసుకుపోయి మాట్లాడించారు. పది రోజుల పాటు సాగు నీరు ఇస్తే తమ పంటలు చేతికి వస్తాయని మా బాధను అర్థం చేసుకొని సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకోవాలని రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రైతుల ధర్నాకు బీఆర్‌ఎస్‌వీ నాయకుడు కుర్వ పల్లయ్య, సీనియర్ నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, సీపీఐ నాయకులు ఆంజనేయులు, ప్రజా సంఘాల నాయకులు ప్రభాకర్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో రైతులు ప్రాణేశ్, రామలింగప్ప, దేవేందర్ రెడ్డి, భీమన్న, జనార్దన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గద్వాల కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

# నల్లమలలో పులుల గణన ప్రారంభం



నల్లమలలో పులుల గణన ప్రారంభించిన అధికారులు

కొల్లాపూర్ రూరల్, మార్చి 24 : ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం మార్చి నెలలో వేసవి కావడంతో పులుల గణన ప్రారంభిస్తారు. 3వ బ్లాక్‌గా గుర్తించిన కొల్లాపూర్, లింగాల, అచ్చంపేట రేంజ్‌లో పులుల లెక్కింపు ప్రారంభించినట్లు ఫారెస్టు అధికారులు, బయోలాజిస్టులు తెలిపారు. గత ఎడాది కొల్లాపూర్ అడవుల్లో 9పెద్ద పుల్లులు ఉన్నట్లు గుర్తించారు. గతేడాదిలో నల్లమలలో 34 పులులను గుర్తించామని, ఈ సారి పులుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. నల్లమల అడవుల్లో వన్యమృగాల వేట, అక్రమ కలప రవాణను అరికట్టేందుకు అడవుల్లో పులులను వదిలామని అలాగే నిఘా కెమెరాలను ఏర్పాటు చేశామని, దీంతో అడవుల్లో ఎవరూ సంచరించకుండా చర్యలు తీసుకున్నామని ఫారెస్టు అధికారులు వెల్లడించారు. మే నెల చివరి వరకు పులుల గణన కొనసాగుతుందని చెప్పారు.